క్లుప్తంగా

అశ్వవాహనంపై వేణుగోపాల స్వామి ఊరేగింపు



అశ్వవాహనం సిద్ధం చేస్తున్న దృశ్యం

బొబ్బిలి: పట్టణంలోని పురాతన రుక్మిణీ సహిత వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాంతర్గత ఉత్సవాల్లో భాగంగా అశ్వవాహనంపై వేణుగోపాలస్వామి ఊరేగింపు ఆదివారం ఘనంగా చేపట్టారు. ఈ నెల 12వ తేదీన పుష్పయాగం, పూర్ణాహుతి, పవళింపు సేవ తదితర కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

బొబ్బిలి: తనను గెలిపిస్తే విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి అన్నారు. ఇదే విషయమై ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు తనకే వేయాలని అభ్యర్థించారు. ఉపాధ్యాయ సంఘ నాయకురాలిగా దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నానన్నారు. ప్రాథమిక పాఠశాల నుంచి యూనివర్సిటీ వరకు విద్యారంగ, ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే మండలిలో సమస్యలను ప్రస్తావించి, పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు.

ప్రజ్ఞా వికాస పరీక్షకు విశేష స్పందన



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రజ్ఞా వికాసం పరీక్షకు విశేష స్పందన లభించింది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల్లో పరీక్ష భయాన్ని పోగొట్టేందుకు ఈ తరహా పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రజ్ఞా వికాస పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులు అందించనున్నామన్నారు. కార్యక్రమంలో పి.రమేష్, బి.రూప తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ గుర్తింపు సంఖ్య

రేగిడి: గ్రామాల్లో భూమి కలిగిన ప్రతి రైతుకూ ఓ గుర్తింపు సంఖ్య ఇవ్వడం జరుగుతుందని ఏవో జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చాటాయివలస గ్రామంలో రైతులతో ఆదివారం సమావేశమైన ఆయన.. రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సేవలు సులభంగా అందించేందుకు ఈ సంఖ్య ఇచ్చే కార్యక్రమం దోహదపడుతుందన్నారు. వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. రైతుకు వ్యవసాయ భూమి ఆధారిత గుర్తింపు అనేది రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో నమోదైన తర్వాత అన్ని వివరాలు అందులో ఉంటాయన్నారు.

అన్నదానం

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. హైదరాబాద్‌లో ఉంటూ గ్రామానికి చెందిన సివిల్ కాంట్రాక్టరు వాకముల్ల సురేష్, సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడులు మజ్జిగౌరి అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తుల కోసం ఈ కార్యక్రమం చేపట్టారు. అంతకాపల్లి, మొగిలివలస, వీఆర్‌అగ్రహారం, పొగిరి, సారధి, గుయ్యానవలస, రామానుజలపేట, శ్యాంపురం తదితర గ్రామాలకు చెందిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు.

- చక్కని ప్రణాళికతో 'పది'లో మంచి మార్కులు
- మార్చి 17 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం
- స్కోరింగ్‌కు విషయ నిపుణుల సూచనలు

మార్కులు.. పదిలం!



పరీక్షలకు సిద్ధమవుతున్న రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు

రామభద్రపురం: పదో తరగతి విద్యార్థి దశలో ఎంతో కీలకం. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పునాది. ఉన్నత శిఖరాల అధిరోహణకు తొలిమెట్టు. అంతటి ప్రాధాన్యం కలిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. టెన్త్‌లో సాధించిన మార్కులే విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగాల సాధనలో ప్రభావం చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంచి మార్కుల సాధనకు విషయ(సబ్జెక్టు) నిపుణులు సలహాలు, సూచనలిస్తున్నారు. అన్ని సబ్జెక్టుల్లో వందకు వంద శాతం మార్కులు సాధించాలంటే చక్కని ప్రణాళిక అవలంబించాలంటున్నారు. సిలబస్, పరీక్షా విధానంపై అవగాహన కలిగి ఉంటే అధిక మార్కులకు అవకాశం ఉందని చెబుతున్నారు. జిల్లాలో 26 వేల పైబడి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

తెలుగు భాషాంశాలపై పట్టుండాలి..



తెలుగు పరీక్షకు సంబంధించి పద్యం, గద్యం, ఉపవాచకాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. కరపత్రం, లేఖ, సంభాషణలో ఏదో ఒక అంశంపై నాలుగు ప్రశ్నలు ఇస్తారు. అలాగే అలంకారాలు, ఛందస్సు, అర్థాలు, పర్యాయపదాలు, ప్రకృతి- వికృతులు, నానార్థాలు, వ్యుత్పత్యర్థాలు, జాతీయాలు వంటి భాషాంశాలపై 22 నుంచి 32 వరకు ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్న-జవాబులతో పాటు గ్రామర్(భాషాంశాలు)పై కూడా పట్టు సాధించాలి. చేతిరాత కూడా బాగుండాలి. అలా అయితే తెలుగులో ఫుల్ స్కోరింగ్ సాధ్యం.

-పి.సింహాచలం, తెలుగు పండిట్, జెడ్పీహెచ్ఎస్, రామభద్రపురం

ఇంగ్లిష్ గ్రామర్‌కు ప్రాధాన్యమివ్వాలి..



ఇంగ్లిష్ ప్రశ్నాపత్రం మూడు విభాగాలుగా ఉంటుంది. 30 మార్కులకు బహులైచ్ఛిక ప్రశ్నలు, 6 మార్కులకు సాధారణ ప్రశ్నలు ఉంటాయి. రీడింగ్ పేరాగ్రాఫ్ ద్వారా 24 మార్కుల వరకు స్కోరింగ్ చేసుకోవచ్చు. గ్రామర్, వొకాబులరీలను బాగా సాధన చేయాలి. గ్రామర్ ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమిస్తే 40 మార్కులకు గాను 25 మార్కులను సులభంగా పొందవచ్చు. లెటర్ రైటింగ్‌కు సంబంధించి పంక్చుయేషన్స్, బాడీ ఆఫ్ ది లెటర్ అంశాలపై పట్టు పెంచుకోవాలి.

-రెడ్డి ప్రభాకర్‌రావు, ఇంగ్లిష్ పండిట్, జెడ్పీహెచ్ఎస్ రామభద్రపురం

ఫిజిక్స్‌లో 70 శాతం మార్కులు సులభమే..



భౌతికశాస్త్రం(ఫిజిక్స్)లోనూ మంచి మార్కులు సులభమే. ప్రశ్నాపత్రం మొత్తం మీద విషయావగాహన అంశాలు వివరించడం, కృత్యాలు రాయడం, ప్రశ్నించడం, కారణాలు తెలపడం, ఉపయోగాలు చెప్పడం, ప్రమాణాలు రాయడం, పటాలు గీయడం తదితర వాటిని ప్రాక్టీస్ చేస్తే దాదాపు 70 శాతం మార్కులు తెచ్చుకోవచ్చు. రసాయనిక చర్యల సమీకరణాలు, ఆమ్లాలు-క్షారాలు, కార్బన్ దాని సమ్మేళనాలు, మానవుని కన్ను-రంగుల ప్రపంచం, కాంతి పరావర్తనం వంటి అంశాలు చదివితే మంచి మార్కులు వస్తాయి.

-ఎం.శ్రీనివాసరావు, ఫిజిక్స్ ఎస్ఏ, జెడ్పీహెచ్ఎస్, రొంపల్లి

సోషల్‌లో పరోక్ష పద్ధతిలో ప్రశ్నలు..



సాంఘికశాస్త్రం(సోషల్) పరీక్షలో ప్రశ్నలన్నీ పాఠ్యపుస్తకాల్లో ఉన్న మాదిరిగా రావు. పరోక్ష పద్ధతిలో ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. 4, 8 మార్కుల జవాబులు రాసేటప్పుడు ఉపశీర్షికలతో అంశాల వారీగా రాయాలి. మధ్యలో ప్రధానాంశాలుంటే అండర్‌లైన్ చేయాలి. 8 మార్కుల ప్రశ్నలకు సమాధానాలు పెద్దగా ఉన్నాయని భయపడాల్సిన అవసరం లేదు. సమాచార నైపుణ్యానికి 15 మార్కులు కేటాయించారు. మ్యాపు గుర్తించడం కూడా సులువే. సమకాలీన అంశాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు డయాగ్రమ్స్, రేఖాచిత్రాలు, పేరాగ్రాఫ్ ఆధారిత ప్రశ్నలను కూడా బాగా ప్రాక్టీస్ చేయాలి.

- కె.దాలినాయుడు, సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్ రామభద్రపురం

హిందీలో ప్రశ్నలు.. ఆరు విభాగాల్లో..



భాగం-1 వ్యాకరణాంశాలకు సంబంధించింది. జవాబులు.. ప్రశ్నాపత్రంలోనే ఉంటాయి. భాగం-2 పద్య భాగానికి సంబంధించింది. రెండు పేరాగ్రాఫ్‌లు ఉండి, వాటి కింద ప్రశ్నలు అడుగుతారు. భాగం-3లో కవి పరిచయాలు, భాగం-4లో ప్రశ్నోత్తరాలు రాయాలి. భాగం-5లో పద్యానికి సంబంధించి, సారాంశం, భాగం-6లో గద్యభాగం నుంచి సారాంశం రాయాల్సి ఉంటుంది.

-పి.స్వాతి, హిందీ టీచర్, జెడ్పీహెచ్ఎస్ రొంపల్లి

గణితంలో వంద శాతం మార్కులు పక్కా..



వందకు వంద శాతం మార్కుల సాధనకు పక్కా అవకాశం ఉన్న ఏకైక సబ్జెక్టు గణితం. ప్రతీ చాప్టర్‌ను బాగా అధ్యయనం చేసి, లెక్కలు చక్కగా ప్రాక్టీస్ చేస్తే మంచి మార్కులు వస్తాయి. వాస్తవ సంఖ్యలు, బహుపదులు, సాంఖ్యకశాస్త్రం, సంభావ్యత, రేఖీయ సమీకరణాలు, నిరూపక రేఖాగణితం, త్రికోణమితి, త్రికోణమితి అనువర్తనాలు తదితర పాఠ్యాంశాలను బాగా సాధన చేయాలి. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది. పాఠ్యాంశం చివరన ఇచ్చే ప్రశ్నలు తప్పకుండా సాధన చేయాలి.

-నాగభూషణరావు, గణిత ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్, రామభద్రపురం

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

రాజాంసిటీ/రేగిడి/తెర్లాం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ సోమవారం చేపట్టనున్నట్లు రాజాం ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అసిరినాయుడు, తెర్లాం ఎంపీడీవో రేగి రాంబాబు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మధ్యాహ్న భోజనం చేసిన అరగంట తర్వాత రెండేళ్ల వయసు దాటి, 19 ఏళ్ల వయసులోపు వారందరితో మాత్రలు మింగించాలన్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్షలు



పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

రాజాం: మండలంలోని పెనుబాక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ, చెన్నైకు సంబంధించిన హిందీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. గత రెండు రోజులుగా ఈ పరీక్షలు జరుగుతున్నాయని హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు తెలిపారు. ప్రథమ, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలు జరిగాయన్నారు. రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి, జి.సిగడాం, తెర్లాం, చీపురుపల్లి ప్రాంతాల నుంచి మొత్తం 212 మంది విద్యార్థులకు గాను 210 మంది ఈ పరీక్షలకు హాజరైనట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలను ఎంఈవో యాగాటి దుర్గారావు పర్యవేక్షించారు.

ముగిసిన మజ్జిగౌరమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



పూజలందుకున్న మజ్జిగౌరమ్మ

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మజ్జిగౌరమ్మ జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. రాజాంతో పాటు రాజాం పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అమ్మవారికి ఘటాలు, ముర్రాటలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

తెర్లాం: మండలంలోని అరసబలగ గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై రాజాం మండలం, బొద్దాం ప్రాంతానికి చెందిన త్రైత సిద్ధాంతం-ప్రబోధ సమితి హిందూ జ్ఞాన కమిటీ సర్పంచ్ కొరగంజి సాయిరాంతో కలిసి ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వీధుల్లో ఇంటింటికీ తిరిగి త్రైత సిద్ధాంత భగవద్గీత గొప్పతనం వివరించారు. మహాశివరాత్రి పర్వదినానికి సంబంధించి, త్రైత సిద్ధాంతంలో ఏ విధంగా బోధించారో తెలియజేశారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులతో పుస్తకాలను లైబ్రేరియన్ చదివించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పుస్తకాలు తప్పనిసరిగా చదవాలన్నారు. పుస్తక పఠనంతోపాటు చిత్రలేఖనం, వ్యాసరచనలోనూ తర్ఫీదు పొందాలన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో ప్రతీ విద్యార్థి చేరాలని కోరారు.

మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

రాజాం: మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ ఆర్.జైభీమ్ హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇంతవరకు చేపట్టిన దాడుల్లో 18 బెల్టుషాపులపై కేసులు నమోదు చేయడం జరిగిందని, 176 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గ్రామాల్లో బెల్టుషాపులకు వేలంపాటలు నిర్వహించినా చర్యలు తప్పవన్నారు. ఎక్కడైనా మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యం

రామభద్రపురం: చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యమని వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నామన్నారు. నులిపురుగులు వల్ల రక్తహీనత, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి ఇబ్బందులు పడుతుంటారన్నారు. నులిపురుగుల బారినపడకుండా 1-19 ఏళ్ల వయసు మధ్య ఉన్న వారందరితో ఈ మాత్రలు మింగించాలన్నారు. మధ్యాహ్న భోజనం చేసిన అరగంట తర్వాత మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ నెల 17వ తేదీన మరోసారి మాత్రల పంపిణీ ఉంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వంగర: మండలంలోని మద్దువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మార్చి 6వ తేదీలోగా ఆఫ్‌లైన్‌లో గానీ ఆన్‌లైన్‌లో గానీ అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

● శిథిలావస్థలో షట్టర్లు.. ఇబ్బందుల్లో రైతులు



రేగిడి మండలం, సంకిలి నాగావళి నదీతీరాన ఉన్న సాయన్న చానల్ షట్టర్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. సంతకవిటి, రేగిడి మండలాలను అనుసంధానిస్తూ ఉన్న ఈ కాలువ ఆయకట్టు పరిధిలో 11,600 ఎకరాలకు ఇదే కాలువ ద్వారా వచ్చే నీరే సాగుకు ఆధారం. ప్రస్తుతం షట్టర్లు బాగాలేని కారణంగా సాగునీరు సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే సాగునీటి కాలువను సాయన్న చానల్ నీటి సంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు ఆదివారం పరిశీలించారు. గతంలో చానల్ ఆధునీకరణకు రూ.3 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారని, అయితే అవి కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి, షట్టర్లు బాగుచేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

-రేగిడి

● పథకాలు ఇవ్వకుంటే.. ప్రజాచైతన్యానికి సిద్ధం..



ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ డిమాండ్ చేశారు. బొబ్బిలికి ఆదివారం విచ్చేసిన ఆయన కాసేపు విలేకరులతో ముచ్చటించారు. పాటలతో ప్రజలను చైతన్యవంతులను చేయడమే తన లక్ష్యమన్నారు. సంపద సృష్టిస్తినంటివో చంద్రబాబు.. మా సంపదనంతా దోచుకుంటివో చంద్రబాబు.. అనే పాట పాడి సీఎం చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. ఎన్నికల సమయంలో ఇస్తానని చెప్పిన ప్రతీ పథకం ఇవ్వాలని లేకపోతే పాట ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాచైతన్య యాత్రకు బయలుదేరుతానన్నారు.

-బొబ్బిలి

● కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలి



ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలని ఆల్ పెన్షనర్స్ అండర్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ బొబ్బిలి కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బొబ్బిలి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడిన వారు.. దేశ వ్యాప్తంగా ఉన్న 78 లక్షల ఈపీఎఫ్ పెన్షన్‌దారులను కేంద్రంలోని మోదీ సర్కారు నిర్లక్ష్యం చేస్తోందని, వారి డిమాండ్లను పరిష్కరించడం లేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 11న చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, ఉపాధ్యక్షుడు వి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

-బొబ్బిలి

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాజాం: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ



సంతకవిటి: బహుమతులతో విద్యార్థులు

రాజాం: పట్టణ పరిధిలోని డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి క్విజ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. రాజాం పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని, విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో డోలపేట, పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు నిలవగా, తృతీయ స్థానంలో కొతారిపురం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు నిలిచారు. వీరందరికీ ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఎల్.గోవిందరావు, టి.హైమావతి, గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో 6, 7 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన గణిత క్విజ్ పోటీల్లో తొలి మూడు స్థానాల్లో లక్ష్మీపురం, రేగిడి, అంబకండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు నిలిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామినాయుడు, సర్పంచ్ కె.తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి గణిత క్విజ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో సిరిపురం, మద్దూరుపేట, సంతకవిటి పాఠశాలల విద్యార్థులు నిలిచారు. వీరికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు.